క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు జరుగుతున్నందున ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్, ప్రశాంతినగర్, కండ్రిక ఫీడర్ ఓల్డ్ పాయకాపురం, నూజివీడు మొయిన్‌రోడ్డు కండ్రిక, రాధానగర్ ఫీడర్ బర్మాకాలనీ, విశాలాంధ్ర కాలనీ, రాధానగర్, డాక్టర్స్ కాలనీ, ఉడాకాలనీ ఫీడర్, ఏపీఎస్ రెడ్డి రోడ్డు, ఓల్డ్ రాజీవ్‌నగర్, న్యూ రాజీవ్‌నగర్, పాయకాపురం ఫీడర్ ప్రకాష్‌నగర్, సుందరయ్యనగర్, ఎల్‌బీఎస్ నగర్, పాయకాపురం సబ్‌స్టేషన్ నుంచి పైపులరోడ్డు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును.

దాసాంజనేయుడికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వీఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌గా శ్రీనివాస్



బొమ్మిడి శ్రీనివాస్

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ సర్కిల్–2 ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్‌గా వీఎంసీ మేనేజర్ బొమ్మిడి శ్రీనివాస్‌ను నియమిస్తూ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్కిల్–2 అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన అనసూయ గతనెలలో ఉద్యోగ విరమణ చేయటంతో కమిషనర్ ఆ స్థానంలో శ్రీనివాస్‌ను నియమించారు. శనివారం శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు.

నేడు ఆర్యవైశ్య సంఘాల ప్రమాణ స్వీకారోత్సవం



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ అర్బన్, జిల్లా ఆర్యవైశ్య సంఘాల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం మొగల్రాజపురంలోని అమ్మ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు గడ్డం సత్యనారాయణ తెలిపారు. కస్తూరిబాయిపేటలోని విజయవాడ అర్బన్ ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రమాణ స్వీకారోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గడ్డం సత్యనారాయణ, పూర్వ అధ్యక్షుడు దర్శి వాసు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో తమ సంఘం ఎప్పుడూ ముందుంటుందన్నారు. రానున్న రోజుల్లో నూతన కార్యవర్గ సభ్యులు సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న భక్తిగీతాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై అమ్మవారి భక్తి గీతాలను ఆలపించారు. శనివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం సంతాన వేణుగోపాల భజన మండలికి చెందిన పి.ఉదయశ్రీ గీత బృందం పలు అమ్మవారి భక్తి గీతాలను ఆలపించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం రాజగోపురం వద్దకు చేరుకున్న భక్తులు ఎంతో ఆసక్తితో భక్తి గీతాలను ఆలకించారు. అనంతరం భజన మండలి సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలను అందచేశారు.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శనిత్రయోదశి సందర్భంగా ఉదయం శనీశ్వరస్వామివారికి విశేష తైలాభిషేకం చేశారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో శ్రీనందీశ్వరస్వామివారికి ప్రదోష సమయంలో అభిషేకం, అర్చన చేశారు. ఆలయ ప్రధాన పూజారి జీఆర్‌వీ సాగర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

తీరిన విద్యుత్ సమస్యలు

- రూ. 3.4 కోట్లతో శ్రీనగర్‌కాలనీలో ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్
- లోఓల్టేజీ, విద్యుత్ సమస్యలకు చెక్



శ్రీనగర్‌కాలనీలో విద్యుత్ సబ్‌స్టేషన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఒకప్పుడు లో ఓల్టేజీ, విద్యుత్ సమస్యలతో అల్లాడిన ముత్యాలంపాడు, శ్రీనగర్‌కాలనీ, టీచర్స్‌కాలనీ, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తొలగిపోయాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇక్కడ ప్రజల అవసరాల డిమాండ్‌కు అనుగుణంగా శ్రీనగర్‌కాలనీలో రూ. 3.4 కోట్లతో ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇక్కడ విద్యుత్ స్టేషన్ నిర్మాణం వల్ల శ్రీనగర్‌కాలనీ, టీచర్స్‌కాలనీ, లక్ష్మీనగర్, భగత్ సింగ్‌నగర్, ముత్యాలంపాడు, అంబేడ్కర్‌కాలనీ, ప్రభుత్వ ముద్రణాలయం ఏరియా, రామకృష్ణాపురంలో మరింత మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. అత్యాధునిక పరిజ్ఞానంతో సబ్‌స్టేషన్‌ను నిర్మించడం వల్ల విద్యుత్ అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

ఇది కదా.. అభివృద్ధి

అలాగే ఈ సబ్‌స్టేషన్ నిర్మాణంతో మధురానగర్, ముత్యాలంపాడు, దుర్గాపురం, అయోధ్యనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లపై లోడ్ తగ్గింది.

163 ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు..

ఈ సబ్‌స్టేషన్ ద్వారా 9,511 గృహ, 1,184 వాణిజ్య, 5 హెచ్‌టీ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారు. ఇందుకుగానూ 163 ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు మొత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయకుండా ఎక్కడ అవసరమో ఆ ప్రాంతంలో మాత్రమే విద్యుత్‌ను నిలిపివేసి మరమ్మతులు చేసేలా ఫీడర్‌లు ఏర్పాటు చేశారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు



ఇక్కడ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించిన తర్వాత విద్యుత్ సమస్యలు తొలగిపోయాయి. ముఖ్యంగా లోఓల్టేజీ, తరచూ విద్యుత్ అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు. లోడు పెరిగినప్పటికీ ప్రజల అవసరాల మేరకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడం అభినందనీయం.

–పెనుమత్స సత్యం, ముత్యాలంపాడు

విద్యుత్ సమస్యలు తొలగిపోయాయి



విద్యుత్ సమస్యలు తొలగిపోవడంతో విద్యుత్ ఉపకరణాలకు రక్షణ ఏర్పడింది. గతంలో తరచూ విద్యుత్ సమస్యలతో విద్యుత్ ఉపకరణాలు పాడయ్యేవి. ఇప్పుడు చక్కగా పని చేస్తున్నాయి. విద్యుత్ సమస్యల తొలగించడానికి కృషి చేసిన ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనిసరావు, కార్పొరేటర్ పెనుమత్స శిరీషకు కృతజ్ఞతలు.

–కడవకొల్లు వెంకటేశ్వరరావు, టీచర్స్‌కాలనీ

వైఎస్సార్ సీపీ హయాంలోనే 'సెంట్రల్' అభివృద్ధి

సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



వాంబేకాలనీలో ఓట్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గంలో అసలైన అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే వెలంపల్లి అల్లుడు మంచుకొండ చక్రవర్తి, డివిజన్ ఇన్‌ఛార్జ్ బెవర నారాయణతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల కరపత్రాలను అందించి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో నగర శివారు ప్రాంతాలు సైతం అన్ని వసతులతో కళకళలాడుతున్నాయని అన్నారు. వార్డు సచివాలయ వ్యవస్థపై అసత్య ఆరోపణలు చేసిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, ఈ నెలలో జరిగిన పెన్షన్ల పంపిణీలో దివ్యాంగులు, వృద్ధుల అవస్థలకు కారకులైన వారిని ప్రజలు ఉపేక్షించబోరని అన్నారు. కిరాణా షాపుల్లో గంజాయి అమ్ముతున్నారంటూ చంద్రబాబు ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. గంజాయి వ్యాపారం చేసేది చంద్రబాబు కుటుంబ సభ్యులేనని, కిరాణా వ్యాపారుల మనోభావాలను దెబ్బతీస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు ఈ రాష్ట్రానికి ఏమి చేశారో చెప్పాలని, కూటమి వల్ల రాష్ట్రానికి ఒరిగేదేమి లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎటువంటి బంగారం దొరకలేదు..!

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత రైల్వేస్టేషన్, సత్యనారాయణపురం పీఎస్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో ఎటువంటి బంగారం దొరకలేదని, ఓ పత్రిక అసత్య కథనాలను ప్రచురించి ప్రజలను తప్పిదారి పట్టిస్తోందని నార్త్ ఏసీపీ డి.ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.
ఆ పత్రికలో శనివారం ప్రచురితమైన రూ. కోటి బంగారం కొట్టేశారు పేరిట రాసిన కథనం పూర్తిగా అవాస్తమని ఆయన పేర్కొన్నారు. కథనానికి సంబంధించి ఎటువంటి ఆధారాలు ఉన్నా సంబంధిత అధికారుల ముందు ఉంచినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిరంతర శ్రమను, త్యాగాలను, నిస్వార్థ సేవలను తక్కువ చేసే విధంగా ఇటువంటి కథనాలను ప్రచురించడం వల్ల పోలీసులు తీవ్ర మనోవేదనకు గురవుతారని అన్నారు.

బాపు మ్యూజియంలో చేనేత హస్తకళా మేళా



చేనేత హస్తకళా మేళాలో వస్త్రాలను పరిశీలిస్తున్న వాణీ మోహన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని బాపు మ్యూజియంలో చేనేత, హస్త కళా ప్రదర్శన, అమ్మకాలు ప్రారంభించినట్లు మేళా నిర్వాహకులు తెలిపారు. ఈనెల 19వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనలో వివిధ రాష్ట్రాల నుంచి నేరుగా ఉత్పత్తిదారులు తాము తయారు చేసిన నాణ్యమైన వస్త్రాలు విక్రయిస్తారన్నారు. ఈ ప్రదర్శనలో పోచంపల్లి, మంగళగిరి చీరలు, డ్రెస్ మెటీరియల్స్, బెంగాలీ కాటన్, శారీస్, జైపూర్ బెడ్ షీట్స్, ఖాదీ వస్త్రాలు, పొందూరు ఖద్దరు, కొండపల్లి, ఏటికొప్పాక చెక్క బొమ్మలు, హైదరాబాద్ ముత్యాలు, 1 గ్రామ్ జ్యూయలరీ, పూజా వస్తువులు, లెదర్ బ్యాగులు మొదలైన వస్తువులు అమ్మకానికి ఉన్నాయని నిర్వాహకురాలు పద్మజ తెలిపారు. ఈ ప్రదర్శనను వాణీమోహన్ ప్రారంభించి వస్త్రాలను తిలకించారన్నారు.

పాలిసెట్ విద్యార్థులకు మాదిరి ప్రశ్నాపత్రాల అందజేత



విద్యార్థులకు ప్రశ్నాపత్రాలు అందజేస్తున్న జిల్లా సైన్స్ అధికారి హుస్సేన్

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రకాష్‌నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ నందు నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్లో శనివారం విద్యార్థులకు మాదిరి ప్రశ్నాపత్రాలను అందజేశారు. గత రెండు, మూడు సంవత్సరాల్లో జరిగిన ఎంట్రన్స్ పరీక్షల్లో వచ్చిన ప్రశ్నాపత్రాలను విద్యార్థుల అవగాహన కోసం ఉపాధ్యాయులు అందించారు. గత పాలిటెక్నిక్ పరీక్షలలోని ప్రశ్నాపత్రాలు ఏ విధంగా ఉన్నాయి, ఆ ప్రశ్నలకు ఏ విధంగా సమాధానం రాయాలి అనే విషయాలను ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ప్రశ్నాపత్రాల పుస్తకాలను 30 మంది విద్యార్థులకు అందజేసినట్లు జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ తెలిపారు. హైస్కూల్ హెచ్‌ఎం పి.మోహన్ అనుమతితో ఉచిత కోచింగ్ సెంటర్‌ను నిర్వహించడం జరుగుతోందని, తనతో పాటు ఆళ్ల శ్రీనివాసరావు అనే ఉపాధ్యాయుడు శిక్షణ ఇస్తున్నారని హుస్సేన్ పేర్కొన్నారు.

అక్కినేని నటజీవితం భావినటులకు ఆదర్శం



రత్నం, స్వాతి, ప్రసూనారామన్‌కు మహానటి సావిత్రి అవార్డులను అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: అక్కినేని నటజీవితం భావినటులకు ఆదర్శమని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్రి సాంస్కృతిక సాహిత్య సేవా సంఘం, గీతాంజలి మ్యూజిక్స్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి మహానటి సావిత్రి అవార్డ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాసత్యనారాయణ మాట్లాడుతూ అక్కినేని లాంటి నటులు అరుదుగా కనిపిస్తారన్నారు. సావిత్రి సేవా సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ అక్కినేని స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని తెలిపారు. న్యాయవాది వేములు హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ కృష్ణాజిల్లా కళల కాణాచి అని చైతన్యానికి ప్రతీకగా అభివర్ణించారు. అక్కినేని జీవితం తెలుగు సినీ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించవచ్చునన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, ఉమాబలరాం, డాక్టర్ భాగ్యశ్రీ, వడ్డాది కామేశ్వరి, సుధారాణి, డాక్టర్ జయంతిచక్రవర్తి తదితరులు అక్కినేని నటించిన చిత్ర గీతాలను ఆలపించారు. మల్లాది స్వాతి, యూవీ రత్నం, ప్రసూనారామన్‌లను మహానటి సావిత్రి అవార్డ్‌లతో సత్కరించారు.

సంస్కృతి సంప్రదాయ పరిరక్షణలో మహిళల పాత్ర కీలకం



సంప్రదాయ వస్త్ర అలంకరణ పోటీల్లో చిన్నారులు

విజయవాడ కల్చరల్: సంస్కృతి సంప్రదాయ పరిరక్షణలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు దూపాటి శ్రీదేవి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో క్రోధి ఉగాది సందర్భంగా బందరురోడ్డులోని మాకినేని బసవ పున్నయ్య భవన్‌లో శనివారం జిల్లా స్థాయి సంప్రదాయ వస్త్ర అలంకరణ పోటీ, ఉగాది పురస్కారాల సభను నిర్వహించారు. శ్రీదేవి మాట్లాడుతూ భారతీయ సంప్రదాయాలు విశిష్టమైనవని ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నట్లు తెలిపారు. శ్రీదేవి సాంస్కృతిక సేవా సంఘం ద్వారా ప్రతీ ఏటా సంప్రదాయ వంటలు, వస్త్రధారణ, చిన్నారులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దూరదర్శన్ వాఖ్యాత చంద్రిక మాట్లాడుతూ నేటి తరం బాలికలకు, యువతకు భారతీయ సంప్రదాయం పట్ల అవగాహన కలిగించాలని సూచించారు. సామాజిక సేవా కార్యకర్త జ్యోతికి నిర్వాహకులు ఉగాది పురస్కారం అందజేశారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ విభాగాల్లో మహిళలకు సంప్రదాయ వస్త్ర అలంకరణ పోటీలు నిర్వహించారు. 250 మంది పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

పేరంటాలమ్మ ఆలయంలో రేపు చండీహోమం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా చండీ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ శనివారం తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 9న తెలుగు సంవత్సర ఉగాది సందర్భంగా ఆలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 13న క్రోధి నామ సంవత్సర చైత్రశుద్ధ పంచమి వసంత నవరాత్రుల సందర్భంగా శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన అష్టోత్తర శతకలశార్చన అభిషేకం, శ్రీ మహాలక్ష్మి యాగం జరుగుతుందని పేర్కొన్నారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

- వెలంపల్లిని అఖండ మెజార్టీతో గెలిపించాలి: ఎంపీ కేశినేని నాని
- 'మేమంతా సిద్ధం' ర్యాలీకి పోటెత్తిన జనసందోహం



ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి, పక్కన ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే విష్ణు, గౌతంరెడ్డి



ర్యాలీలో పాల్గొన్న జన సందోహం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేశానికే ఆదర్శంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని, పేదల జీవితాల్లో నూతన వెలుగులు నింపిన సంక్షేమ ప్రభుత్వానికి అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) అన్నారు. స్థానిక గాంధీనగర్ ఐనాక్స్ థియేటర్ సమీపంలో శనివారం 'మేమంతా సిద్ధం' ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఆయన సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఏపీ ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, ఏపీ ఫైబర్‌నెట్ ఛైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, స్థానిక కార్పొరేటర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ అహర్నిశలు పేదల అభ్యున్నతికి పని చేసిన జగనన్న పాలన కోసం ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. చంద్రబాబు పాలనలో 11 శాతం ఉన్న పేదరికం వైఎస్సార్ సీపీ పాలనలో నాలుగు శాతానికి తగ్గిందని నీతి ఆయోగ్ వెల్లడించడం జగనన్న ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుందని అన్నారు. జగనన్న పాలనలో అన్నిరంగాల్లో 10 శాతానికి పైగా వృద్ధి సాధించిందని వివరించారు. కార్పొరేట్ విద్య, వైద్యంకు దీటుగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

చంద్రబాబుకు ఓటు అడిగే అర్హత లేదు..

అధికారంలో ఉండగా పేదలను పట్టించుకోని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను ఎన్నికల్లో తరిమి కొట్టాలని కేశినేని నాని పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తుల కోసం ప్రభుత్వ సొమ్మును దోచిపెట్టిన చంద్రబాబుకు ఓటు అడిగే అర్హత లేదని అన్నారు. తాగుబోతు రౌడీ బొండా ఉమాకు ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అందిన కాడికి దండుకోవడమే ధ్యేయంగా పనిచేసిన బొండాకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ పేదల కోసం పని చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు. ప్రజల కోసం అహర్నిశలు శ్రమించే మంచి వ్యక్తి వెలంపల్లి శ్రీనివాసరావు అని ఆయనకు అండగా ఉండాలని కోరారు. ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అఖండ స్వాగతం పలుకుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తాము పనిచేస్తామని అన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఏపీ ఫైబర్‌నెట్ ఛైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడారు. దారి పొడవునా హారతులు పడుతూ పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. గాంధీనగర్ ఐనాక్స్ నుంచి ముత్యాలంపాడు, బుడమేరు మధ్యకట్ట, మధురానగర్ మీదుగా సిద్ధం ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, మంచుకొండ చక్రవర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అత్తింటి వారిపై వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు గ్రామానికి చెందిన వెలిశిల కీర్తికుమారి 2014వ సంవత్సరంలో విజయవాడ చిట్టినగర్‌కు చెందిన సంజయ్‌కుమార్‌ను కట్న కానుకలు ఇచ్చి పెద్దలు వివాహం చేశారు. వీరికి పాప పుట్టింది. అయితే పెళ్లి సమయంలో భర్త ప్రభుత్వ ఉద్యోగం అని చెప్పగా అతనికి ఎటువంటి ఉద్యోగం లేదు.
పైగా ఆడపిల్ల పుట్టిందని, ఇచ్చిన కట్నం చాలదని, అదనపు కట్నం తీసుకరమ్మని భర్తతో పాటు మామ విజయ్‌కుమార్, అత్త వెరిసీకమ్మ, ఆడపడుచు ప్రశాంతి, ఆమె భర్త అజయ్‌కుమార్ వేధింపులకు గురి చేయటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు వరకట్నం వేధింపు కేసు నమోదు చేశారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో కల్యాణి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జీవీ శ్రీనివాసరావు అన్నారు. భవానీపురం క్రాంబే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో శనివారం 39వ వార్షికోత్సవం సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా అకడమిక్, కో–కరిక్యులర్ యాక్టివిటీస్, క్రీడల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పరీక్షలకు ఎలా, ఏ విధంగా చదివితే ఉత్తమ ఫలితాలను సాధిస్తారనే అంశంపై విద్యార్థులకు వివరించారు. సెయింట్ జాన్స్ పాఠశాల సెక్రటరీ/కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ టి.మోనిక సుమన్, అకడమిక్ హెడ్స్ కేవీ కల్యాణి, పావన దీప్తి, ప్రిన్సిపాల్ సుచరిత పాల్గొన్నారు.

దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

పెనమలూరు: గంగూరు గ్రామంలో ఆటో డ్రైవర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగూరు ఉర్దూ స్కూల్ ప్రాంతానికి చెందిన నందిపాముల సురేష్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి అదే ప్రాంతానికి చెందిన కోటమ్మ ఫోన్ చేసి ఆటో కిరాయికి రావాలని కోరింది. దీంతో సురేష్ ఆటోతో కోటమ్మ ఇంటికి వెళ్లాడు. అయితే అక్కడ కుమారి, కోటమ్మ, సతీష్ పలువురు వ్యక్తులు ఉన్నారు. ఆటో డ్రైవర్ సురేష్ వద్దకు వెళ్లి సతీష్, కోటమ్మలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కుమారి పట్ల అసభ్యంగా మాట్లాడుతున్నావు ఏమిటని అతనిపై దాడి చేశారు. దీంతో సురేష్ తలకు గాయమైంది. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

మార్కెటింగ్ సృష్టించే విలువలపై వెబినార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరి నీరజ అధ్యక్షతన శనివారం మార్కెటింగ్ సృష్టించే విలువలపై వర్చువల్‌గా వెబినార్ జరిగింది. కార్యక్రమంలో విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల డీన్ డాక్టర్ రాజేష్ సీ జంపాల ముఖ్యఅతిథిగా పాల్గొని 'వస్తు సేవల కల్పనలోనూ, వాటి అవసరాన్ని ప్రచారం చేయడంలోనూ, వాటిని వినియోగదారుడికి అందజేయడంలోనూ మార్కెటింగ్ పాత్ర' అనే అంశంపై ప్రధాన ఉపన్యాసం చేశారు. నేడు మార్కెట్‌లో బ్రాండును బట్టి వస్తు సేవల అమ్మకాలు జరుగుతున్నాయని, వినియోగదారులను గుర్తించడంలోనూ, వారిని సంతృప్తి పరచడంలోనూ, తమ వస్తువులను మాత్రమే వాడేటట్లు చేయడంలో మార్కెటింగ్ పాత్రను వివరించారు. మార్కెటింగ్ మౌలికాంశాలను, నాలుగు పీ(ప్రోడక్ట్, ప్రైస్, ప్లేస్, ప్రమోషన్)లు గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ నీరజ మాట్లాడుతూ నేటి అత్యాధునిక యుగంలో మన జీవితాలను ప్రభావితం చేసే స్థాయికి ఎదిగిన మార్కెటింగ్ రంగం గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించేందుకు వెబినార్ ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.